కన్సోలేషన్ బహుమతి కథ

అదే నవ్వు- పూల జలపాతంలా స్నిగ్ధంగా,

అదే రూపం- పూల పల్లకిలా ముగ్ధంగా - రెప్పవాల్చకుండా శివమాలనే తన ఇంటి కిటికిలో నుండి చూస్తుంది పూర్ణిమ.

పూర్ణిమ ఎదురింటిలో సంవత్సరం నుండి అద్దెకి వుంటుంది శివమాల. గ్రామీణ బ్యాంక్‌లో క్లర్క్‌గా పనిచేస్తుంది శివమాల. బ్యాంక్‌కి బయలుదేరుతూ ఇంటికి తాళం వేస్తుంటే "ఏంటే ఉద్యోగానికి వెళుతున్నావా" అని విన్పించింది. ఆమె వెనక్కి తిరగకుండానే ఆ స్వరాన్ని గుర్తించింది. ఆ స్వరంలో విస్మయాన్ని గమనించింది.

వాంచారి. ఇంటి యజమానురాలు.

శివమాల తాళం వేసి వెనక్కి తిరిగి "ఈ వేళ రాములింకా రాలేదు. ఏదైనా దూరం బేరం వస్తే వెళ్ళాడనుకుంటాను. నేనెళ్ళాక కాని వస్తే రేపు కాస్త త్వరగా రమ్మని చెప్పండి. వెళ్ళొస్తానండి అమ్మమ్మగారు" అంటూ ఆమె ఆశ్చర్యాన్ని ఏ మాత్రం లక్ష్యపెట్టకుండా కాంపౌండ్ వాల్ గేట్ తీసుకొని వీధిలోకి వచ్చింది శివమాల.

అరవైఏళ్ళ వాంచారికి లౌక్యం తెలియదు కాబట్టి నిర్మొహమాటంగా తన ఆశ్చర్యాన్ని ప్రకటించింది. ఎన్నో జతల కళ్ళూ, మరెన్నో జతల అధరాలు ఆశ్చర్యాన్ని, అసహ్యాన్ని ఆ క్షణంలో ప్రకటిస్తున్నాయని శివమాలకి తెలుసు. అయినా ఆమె ఎవ్వర్నీ లక్ష్యపెట్టకుండా ఠీవిగా నడుస్తుంది ఎప్పటిలా ఆ వీధిలో.

"అదే నడక- అదే ఠీవి. ఇదెలా సాధ్యం" అని ఆశ్చర్యపోయింది పూర్ణిమ.

శివమాల వుంటున్న ఇంటికి బ్యాంక్, నడిచి వెళ్ళేంత దూరంలో లేదు. ఉదయంపూట ఆమె రిక్షాలో వెళుతుంది. ప్రతి రోజూ ఆమెని తీసుకువెళ్ళే రిక్షా అబ్బాయి పేరు రాములు.

# నెలవంక

కుప్పిలి పద్మ



శివమాల వీధి చివరికి వచ్చేసరికి నలుగు రైదుగురు రిక్షా అబ్బాయిలు రిక్షాలలో కూర్చుని సినిమాల గురించి తన్మయంగా మాట్లాడుకుంటున్నారు. వాళ్ళలో రాములు వుండడం చూసి శివమాల "నువ్వింకా బేరంపై దూరం వెళ్ళావనుకున్నాను. సినిమా కథ వింటూ కూర్చున్నావా? త్వరగా పద టైమ్ అయిపోతుంది" అంది హడావిడిగా.

శివమాలని చూస్తుంటే రాములికి నోట మాట రాలేదు.

"రాములికి కూడా తెల్సిందా? అవును ఇదేమంత పెద్ద వూరు, అందరూ అందరికీ తెలిసేంత. ఈ వూరిలో నా విషయం తెలియని వారుంటే ఆశ్చర్యపోవాలి కాని, తెలిస్తే ఆశ్చర్యం ఏముంది?" అనుకుందామె.

"మా.. ట.. ల్లో.. టైమ్ చూసు.. కోలేదమ్మా" అక్షరాలు కూడబలుక్కుంటూ అన్నాడు రాములు.

ఆమె ఆ విషయం గమనించనట్టే "పద త్వరగా. టైమ్ అయింది" అంది.

బ్యాంక్‌లో ప్యూన్ నుండి మేనేజర్ వరకు ఆమెని వింతగా పట్టిపట్టి చూసారు. గుసగుసలు పోయారు. ఆమె దగ్గరికి రాగానే గప్‌చిప్ అయి పోయేవారు. ఆ మాటలు, నవ్వులు తన గురించేనని ఆమెకి తెలుసు. అయినా ఆమె చెరగని చిర్నవ్వుతో సాయంత్రం వరకు పని చేసింది.

సాయంత్రం బ్యాంక్ నుండి ఇంటికి నడిచి రావటం ఆమెకి అలవాటు. ఎప్పటిలానే బ్యాంక్ టైమ్ అవగానే దారిపక్క గడ్డిపువ్వులని, విరిగిన

మేఘాలని, ఎగిరే పాలపిట్టల్ని, పారే కాలువని చూస్తూ మెల్లగా నడుస్తుంది శివమాల.

"ఒక్క రోజు గడిచింది. ఇంకేం పర్లేదు. నే సాధించాను. నాక్కావల్సిన ఆనందాన్ని పొందు తాను. నేనా జీవితాన్ని నాకు కావల్సిన రీతిలో మల్చుకుంటాను. నే గెలిచాను" అనుకుం దామె.

** ** **

నెల రోజులు గడిచాయి.

"బ్యాంక్‌కి టైమ్ అయిందమ్మాయ్. త్వరగా తెములు" పూజ మధ్యలో బయటకి వచ్చి మరీ టైమ్ చెబుతుంది నాంచారి.

కరెక్ట్ టైముకి రాములు వచ్చి 'అమ్మగారు' అంటూ గంట గణగణలాడిస్తూ పిలుస్తాడు.

పక్కింటి పరంధామయ్యా, ఎదురింటి ఏకదంతం, మధ్య ఇంటి మహాలక్ష్మమ్మా బుగ్గలు నొక్కుకోవడం మానేసారు.

బ్యాంక్‌లో ప్యూన్ నుండి మేనేజర్ వరకు కళ్ళలో కుతూహలం, పెదవులపై వంకర నవ్వు తగ్గించేసారు.

పూర్ణిమ మాత్రం విస్మయ సాగరంలో కొట్టుకుపోతూనే వుంది.

"ఇదెలా సాధ్యం"- నిరంతరం ఆమెని వెంటాడుతూనే వుందా ప్రశ్న.

ఒకానొక సంధ్యవేళ, విరజాజి విచ్చుకోన దానికి ఆయత్తమయ్యే వేళ పూర్ణిమ చాలాకాలం తర్వాత ఇంటి గుమ్మం దాటి శివమాల ఇంటి వైపు తడబడే అడుగులతో కదిలింది.

వీధి వీధంతా పూర్ణిమని వింతగా చూస్తు న్నారు. పూర్ణిమ తలదించుకొని శివమాల ఇంటి తలుపుని వణికే వేళ్ళతో తట్టింది.

ఓ క్షణం తర్వాత తలుపు తెరిచిన శివమాల పూర్ణిమని చూసి "లోపలికి రండి" అని మర్యా దగా ఆహ్వానించింది.

పూర్ణిమ లోపలికి వచ్చింది.

"కూర్చోండి" అని శివమాల లోపలికి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది.

నీళ్ళు తాగుతూ పూర్ణిమ ఇంటిని పరిశీల నగా చూసింది. చాలా అందంగా, శుభ్రంగా వుందా ఇల్లు. లోపల గదిలో టేప్ రికార్డర్‌లో నుండి శ్రీశ్రీగారి గీతం "కలకానిది విలు వైనది" చిన్నగా వినిపిస్తోంది. కొన్ని క్షణాల క్రితం బుద్ధుని ముందు వెలిగించిపెట్టిన గంధం అగరొత్తుల పరిమళం ఆ గదంతా పల్చగా పర్చుకొని ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. శివమాల నయనాల్లో వెలిగే కాంతిని చూస్తూ "మీ.. రు.. ఇలా.. ఎలా.. వుం.. టున్నారు" చప్పున అడి గింది పూర్ణిమ.

లలితమైన చిర్నవ్వుని అధరాలపైకి జార్చి "ధైర్యంతో" అంది శివమాల.

పూర్ణిమ వింతగా అర్థం కానట్టు చూసింది.

"పూర్ణిమ! మీరు వివరంగా అడగకపోయినా మీ ప్రశ్న, సందేహాలు ఏంటో నే నూహించ గలను. విడాకులు తీసుకున్న నేను ఈ సమా జంలో ఎలా బ్రతుకుతున్నాననే కదూ నీ ప్రశ్న. ఉద్యోగం ఎలా చేస్తున్నాననే కదా నీ సందేహం. నా పెళ్ళికి ముందే నా చదువు పూర్తిఅయింది. ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాతే నా వివాహం అయింది. మా ఇద్దరికి కుదర్లేదు. నరకంలా వుంటున్నట్టుండేది. డైవర్స్ తీసుకున్నాను. నా జీవితంలోని దుఃఖాన్ని పోగొట్టుకోవాలని నే డైవర్స్ తీసుకున్నాను. తీసుకున్నాక కూడా నలు గురూ అనే మాటలకి భయపడి ఏడుస్తూ ఇంట్లోనే కూర్చుని కుమిలిపోతూ నేనెందుకు బ్రతకాలి. స్త్రీ పురుషులు వివాహమనే బంధం వలన ఒకరికొకరు తోడునీడగా జీవితాంతం బ్రతకడంలో ఆనందం వుంది. అలా కుదరక విడిపోయినప్పుడు భర్తతోనే జీవితం ముగిసిపోయి నట్టు నిలపించి జీవితాన్ని వ్యర్థంగా ఎందుకు గడపాలి? భర్త కోసం నే చదువుకోలేదు. ఉద్యోగం చెయ్యలేదు. ఇప్పుడు అతను లేడని మానలేను" అంది శివమాల.

"మిమ్మల్ని అందరూ మీరే ముందుగా విడా కులు కోరారని నానామాటలు అంటుంటే ఎలా భరించారు. అసలెలా బయటకి వచ్చారు" ఆశ్చ ర్యంగా అడిగింది పూర్ణిమ.

"పూర్ణిమా నువ్వు డైవర్స్ కోరలేదు. నీకు ఆ తలంపే లేదు. అయినా మీరిద్దరూ విడి పోవల్సి వచ్చింది. అయినా అంతా నిన్ను రక రకాల మాటల్తో హింసించారు. అంటే ఇక్కడ మనం గమనించాల్సిన ముఖ్య విషయం స్త్రీ ప్రమేయం ఏం లేకపోయినా స్త్రీనే సమాజం ముందుగా విమర్శిస్తుంది. కట్నాల కోసం భార్య లని-తగలపెట్టే నీచులు, వ్యర్థ అనుమానాలతో భార్యలని బంధించే గజదొంగల్లాంటి మగవాళ్ళు, వ్యసనాలతో బాధ్యతలని విస్మరించే ఉన్మా దులు, ఎందరో మగవాళ్ళు తలెత్తుకొని దర్జాగా బ్రతికేస్తుంటే ఏ అపరాధం చెయ్యని నన మెందుకు తలదించుకొని బ్రతకాలి. ఎవరైనా ఏమైనా అన్నప్పుడు నా మనసు బాధపడుతుంది. వెంటనే ఈ దౌర్భాగ్య మగవాళ్ళంతా గుర్తు

[తరువాయి 59 వ పేజీలో]

# ● సినిమా క్విజ్ ●

ప్రతి నెలా పాఠకుల కోసం సినిమాకు సంబంధించిన ఒక క్విజ్‌ను నిర్వహిస్తున్నాము. ఈ క్విజ్‌లో విజేతలకు నెల నెలా రు. 50/-లు బహుమతిగా అందజేస్తాము. విజేతలు ఒకరికన్నా ఎక్కువ మంది వుంటే లాటరీ పద్ధతిలో లక్కీ నెంబర్ డ్రా తీసి, అలా గెలుపొందినవారికి బహుమతి సొమ్ము అందజేయడం జరుగుతుంది.

కార్డుపైన 'సినిమా క్విజ్', ఎడిటర్, 'వనితాజ్యోతి' ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, లబ్బీపేట, విజయవాడ - 520 010 చిరునామాకు పంపాలి.

ఈ ఫోటోలోని నాటి ప్రముఖ హిందీ హీరోయిన్ ఎవరు? మీ సమాధానాలు ఈ క్రింది కూపన్‌లో వ్రాసి, దానిని కత్తిరించి ఒక పోస్ట్ కార్డుపై అంటించి మా చిరునామాకు డిసెంబర్ 10వ తేదీలోగాఅందేలా పంపండి.

## సినిమా క్విజ్/ఎవరు?

నటి పేరు ..........................................

పంపిన వారి పేరు ..................................

చిరునామా ..........................................

..........................................

..........................................



## సినిమా క్విజ్ ఫలితం

సమాధానం: తార మధుబాల

ఈ సారి ఎక్కువ మంది ఆల్ కరెక్టుగా వ్రాసారు. వీరిలో లాటరీ పద్ధతిలో బహుమతి పొందుతున్న వారు: శ్రీమతి కె.లక్ష్మీదేవి, C/o పి.బి.వి.రాజు, కొత్తపేట, తుని- 533 401. వీరికి బహుమతి సొమ్ము అందజేస్తాము. పోటీలో పాల్గొన్నవారందరికీ అభినందనలు.

—ఎడిటర్

## వింత ప్రపంచం

### హంగేరి ద్రౌపది

జోసెఫ్ ఎవగెంతె అనే హంగేరి సుందరి భారతదేశంలోని వారణాసికి వచ్చి మహాభారతం గురించి పరిశోధన చేసింది.

ఈ పరిశోధనలో ఆమెకు ద్రౌపది పాత్ర ఎంతగానో నచ్చింది. ఆ పాత్ర ఆమె మీద ఎంత ప్రభావం కలిగించిందంటే, ఆమెకు కూడా ఐదుగురు భర్తలను పొందాలని వున్నట్లు, అందుకు ఇష్టపడ్డ యువకులు ముందుకు రావలసిందని పత్రికా ప్రకటన చేసింది.

### కథాసాగరంలో ఎలుక ప్రహసనం

'కథాసాగర్' సీరియల్ ప్రసారమవుతున్న సమయంలో (బొంబాయినుండి) ఒక ఎలుక ట్రాన్స్‌మిటర్ సర్క్యూట్‌లో దూరి అక్కడ కాలిపోవడంతో ఈ సీరియల్‌కి 12 సార్లు అంతరాయం కలిగిందట!

### ప్రభుత్వ బస్సును పొందిన గుమస్తా

కోట: రాజస్థాన్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థ ఒక లోయర్ డివిజన్ గుమాస్తా 'ఖాన్' అనే వ్యక్తికి రూ. 45000/- నష్టపరిహారంగా ఇవ్వవలసిందని కోర్టు ఇచ్చిన ఆజ్ఞను ఖాతరు చేయనందుకు కోర్టు ఒక ఆర్.టి.సి. బస్సు స్వాధీనం చేసుకొని దానిని ఖాన్‌కి ఇచ్చేసింది. రాజుగారు మెచ్చి కవిగారికి ఏనుగును బహూకరించినట్లు వుంది.

### నేరాన్ని అరికట్టే శునకం

టొరొంటోలోని ఒక జర్మన్ షెపర్డ్ శునకం కొత్త రకంగా తర్ఫీదు పొందిందట. అది ఆడవారిపై అత్యాచారాలు జరిపే వారిని, దోపిడీ దొంగలను ఇట్టే పట్టేస్తోందట! తప్పుడు పని చేస్తున్న వారిని చూడగానే వెంట తరిమి కరిచేస్తుంది. ఈ మధ్య ఇద్దరు రౌడీలు ఒక యువతిపై అత్యాచారం జరుపుతుండగా చూసి వెంటనే వారిని తరిమి తరిమి కొట్టిందట. ఆ తరువాత ఆ యువతి దగ్గరకు చేరి ప్రేమగా మొహమంతా నాకుతూ — ఊరడించిందట!

### కుటుంబ నియంత్రణ

ఆర్మడెల్లో అనే స్తన్యజాతి జంతువు అద్భుతమైన రీతిలో కుటుంబ నియంత్రణ పాటిస్తుంది. కడుపులో వున్న ఆర్మడెల్లో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోతే అండం పెరుగుదలను ఒక ఏడాది వరకూ అరికట్టగల శక్తి దీనికుందిట! తిరిగి పరిస్థితులు అనుకూలించినపుడు అండం పెరుగుతుందిట!

---

[51వ పేజీ తరువాయి]

వస్తారు. విలువైన జీవితం గుర్తొస్తుంది. నేను ధైర్యవంతురాలైన శివమాలని అయిపోతాను" అందామె చిర్నవ్వుతో.

"వీళ్ళందరి మాటలు భరించే శక్తిలేక ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఏడుస్తూ కూర్చున్నాను. మీరు వీళ్ళందర్నీ ఎలా మార్చారో తెలుసుకుందామని కుతూహలం ఆపుకోలేక వచ్చాను" అంది పూర్ణిమ.

"నేను వీళ్ళని మార్చటం ఏమిటి" ఆశ్చర్యంగా అని అంతలోనే నవ్వేస్తూ "పాత్రబట్టి రూపం సంతరించుకునే నీరులాంటిది మనిషి మనసు. భయపడేవాడిని భయపెడుతుంది. ఏడిచే వాళ్ళని ఏడిపిస్తుంది. ధైర్యవంతులకి ధైర్యం చెబుతుంది. నువ్వు ఉద్యోగం మాని ఇంట్లో కూర్చుంటే అదే సరియైన నిర్ణయంలా మాట్లాడారు. నేను ఎవర్నీ లక్ష్యపెట్టకుండా ఉద్యోగం చేసుకుంటూ, నవ్వుతూ బ్రతుకుతుంటే ఇదే మంచి పద్ధతి అంటున్నారు. ఇటువంటి మనుషులకి భయపడడంలో అర్థం ఏమైనా వుందంటావా" అంది శివమాల.

పూర్ణిమకి ఆశ్చర్యం వేసింది. ఇంత చిన్న విషయానికి తనెందుకింత కాలం ఏడుస్తూ వ్యర్థంగా గడిపింది. ఎంత అమాయకత్వం! ఎంత మూర్ఖత్వం. **Thanks to Sivamala.** ఇప్పటికైనా నా కళ్ళు తెరిపించావ్ అనుకుంటూ శివమాలకి వెళ్ళొస్తానని చెప్పి బయటికి వచ్చి తనింటివైపు తలెత్తి నిటారుగా నడిచింది.

నిరజాజి పూర్తిగా విచ్చుకొని సువాసనలు విరజిమ్మటానికి ఆయత్తమవుతూంది. ఆకాశంలో ఉదయిస్తున్న నెలవంకని చూస్తూ 'ఉద్యోగంలో జాయిన్ అవ్వాలి' అనుకుంది పూర్ణిమ.

అమావాస్య తర్వాత ఉదయించిన నెలవంకను జాబిల్లిగా రూపాంతరం సంతరించుకోకుండా నిలిపే శక్తి ఎవ్వరికీ లేదు.

అలాగే పూర్ణిమ జీవితాన్ని ఆనందంగా తీర్చిదిద్దుకోవాలనే తలంపుని ఏ శక్తి నాశనం చేయలేదు.

---

రించుకుంటుంది.

కోడిగుడ్డు ఆహారంగానే కాదు, చర్మానికి, శిరోజాలకు సౌందర్య పోషక పదార్థంగా ఉపయోగ పడుతుంది. గుడ్డులోని తెల్ల సొనను ముఖానికి పట్టించి 20 నిముషాలు ఆగి, గోరువెచ్చని నీటితో కడగాలి. ఆ తరువాత చల్లని నీటితో కడగాలి. మీ చర్మం ఎండిపోయి నట్లుగా ఉన్నట్లయితే తరచూ ఈ విధంగా చేయవచ్చు.

తెల్లసొనను ముఖానికి పట్టించడంవల్ల ముఖం మీది గుంటలలోని మురికి తొలగిపోతుంది. ముఖ చర్మం మృదువుగా వుంటుంది. ముఖం బాగా అలిసినట్లుగా వున్నప్పుడు ఇది చాలా చక్కగా పనిచేస్తుంది.

రెండు గుడ్లను గిలకొట్టి దానికి కొన్ని చుక్కల నిమ్మరసాన్ని కలిపి ఆ మిశ్రమాన్ని మాడుకు, శిరోజాలకు పట్టించి కొంతసేపాగి తలస్నానం చేస్తే శిరోజాలు మృదువుగా పట్టులా వుంటాయి.

ఇంటిలో తయారు చేసే ఈ సౌందర్య సాధనాలు చాలా చౌకగా, తేలికగా, త్వరగా తయారు చేసుకోవచ్చు.

అయితే తక్కువ పరిమాణంలో తయారు చేసుకోవాలి.